దెయ్యాల బండి

అపర్ణా నైటింగేల్

(గత సంచిక తరువాయి)

6 "కూ...." అంటూ ఎక్కడో దూరాన కూత వినిపించింది.

"చుక్ .... చుక్ .... చుక్ .... చుక్" దయ్యాల బండి వస్తోన్న చప్పుడు వినిపించింది.

"టంగ్ .... టంగ్ .... టంగ్" గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

కవిత బెడ్ మీద కదిలింది.

లేచి బెడ్ దిగింది.

బెడ్ రూమ్ తలుపు తెరుచుకొని నడువాలోకి వచ్చింది.

నిద్రమత్తులో జోగుతూనే అడుగులు వేస్తూ బెడ్ రూమ్ వైపు వెళ్ళింది.

అక్కడ బాత్ రూమ్ తలుపు పక్కన రాజా నిలబడి వున్నాడు.

"ఏం బాబూ! బాత్ రూమ్‌కి వచ్చావా?" అడిగిందామె.

"అవును మమ్మీ!" అంటూ నవ్వాడు రాజు.

ఆ నవ్వు వికృతంగా వుంది.

కవితకు ఎందుకో గుండె ఝల్లుమంది.

ఆమె అదేమీ పట్టించుకుండా "పద బాబూ!" అంటూ రాజు చెయ్యిని పట్టుకోబోయింది, బాత్ రూమ్ లోపలికి తీసుకు వెళ్దామని.

కాని—

ఆమె రాజు చెయ్యి పట్టుకోబోయేంతలో "హీ.... హీ....హీ" అంటూ నవ్వసాగాడు రాజు.

పళ్ళలో నాలుగువైపులా కోరలు మొలుచుకొచ్చాయి.

కనుగుడ్లు బయటికి వెళ్ళుకొచ్చి ఎర్రగా గోళాల్లా మండుతున్నాయి.

చెయ్యి పొడవుగా సాగుతూ కవిత ముఖంమీదికి రాసాగింది.

కవిత భయంతో "కెవ్వు"మనబోయింది.

అలా అని అరవాలనుకుంది. కాని, అరుపు నోటినుండి బయటకి వెలువడలేదు.

కాళ్ళు గజగజా వణకసాగాయి.

నరాలు తెగిపోతున్నట్లనిపించింది.

రక్తం మంచులా గడ్డకట్టుకుపోతోంది.

కళ్ళలో భయం....

గుండెలో భయం....

తనువుమీద భయం....

అణువణువునా ఆమెలో భయం....

ఆ ప్రదేశం నుంచి వెనక్కు తిరిగి పోవాలనుకున్నా

పారిపోలేక పోతోందామె.

పాదాలు గచ్చుకి గట్టిగా అతుక్కుపోయాయి.

రాజు చెయ్యి సాగుతూ వచ్చి కవిత ముఖాన్ని తాకింది.

అంతే!

"కవ్వ్యా"మంటూ బంగళా ప్రతిధ్వనించేలా కేక వేసిందామె.

ఎక్కడలేని శక్తి కూడదీసుకొని వెనక్కు తిరిగి ఒక్క పరుగున బెడ్ రూమ్‌లోకి వచ్చి పడింది.

దామోదర్ మీద పడిపోయి అతన్ని గట్టిగా వాటేసుకుని వణికిపోసాగింది.

దామోదర్ వులిక్కిపడి లేచాడు.

కవిత చిగురుటాకులా వణికిపోతోంది భయంతో.

"ఏమైంది కవితా?" ఆతృతగా అడిగాడతను.

"దె.... దె . దెయ్యం" అందామె వణుకుతూ.

"ఏదీ? ఎక్కడ?" కంగారుగా చుట్టూ చూస్తూ అడిగాడు.

"బాత్ రూమ్ దగ్గర రాజు అలా కనిపించాడు" అంటూ వివరించి చెప్పింది కవిత.

"ఆ" అంటూ అతను చాలా సేపటిదాకా నోరు తెరుచుకొని వుండిపోయాడు.

అతని ముఖంలో కూడా భయం స్పష్టంగా తొంగి చూసింది.

"దామోదర్! ఆ రోజు రాజు నీకిలా కనిపిస్తే బహుశా సువ్వారోజు చూసిన 'ఈవిల్ డెడ్' సినిమా ప్రభావంవలన నువ్విలా భ్రమపడ్డావని అనుకున్నాను. కాని నేను యే భయంకరమైన సినిమా కూడా ఈ మధ్య చూడ

లేదు. అసలు నేను లేచి బాత్ రూమ్‌కి వెళుతున్నప్పుడు నాలో భయంగొలిపే ఎలాంటి ఆలోచనా కలగలేదు. అలాంటిది మనబ్బాయి అలా కనిపించాడంటే నాకు నిజంగా చాలా భయం వేస్తోంది” అంది కవిత.

ఆమె తనువు ఇంకా కంపిస్తోంది.

అధరాలు వణుకుతున్నాయి.

“అంటే....అంటే....రాజాకి యేమయిందని నీ వుద్దేశం?” దామోదర్ కంఠంలో అనుమానం, ఆయోమయం తొంగిచూశాయి.

“రాజాకి దయ్యం పట్టి వుందని నా అభిప్రాయం. లేకపోతే మనబ్బాయేమిటి? అలా దెయ్యంలా కనిపించడమేమిటి?” అని అంది కవిత.

“అవును. నీవన్నది నిజం. ఆ రోజు నాకూ అలాగే కనిపించాడు. కాని, నేను హారర్ సినిమా చూడటం వలన, నువ్వు చెప్పినమీదట నా భ్రమేమోనని అనుకున్నాను” అన్నాడు దామోదర్.

“అయితే ఇప్పుడేం చేద్దాం దామూ!?” అంది కవిత. ఆమె ముఖంలో కంగారు కనిపిస్తోంది.

“పద. ఇద్దరం బాత్ రూమ్ దగ్గిరికి వెళ్ళి చూద్దాం. తరువాత యేం సంగతీ ఆలోచిద్దాం” అని అంటూ దామోదర్ ముందుకు అడుగులు వేశాడు.

వెనుకనే కవిత బిక్కు బిక్కుమంటూ అతనిని అనుసరించింది.

బాత్ రూమ్ తలుపులు తెరుచుకొని రాజా బయటకు వస్తున్నాడు.

రాజాని పలకరించడానికే భయం వేసింది కవితకు.

“ఏం బాబూ! బాత్ రూమ్‌కొచ్చావా?” అడిగాడు

దామోదర్.

"అవును డాడీ!" అన్నాడు రాజు.

ఆ బాలుని ముఖం ప్రశాంతంగా వుంది.

కళ్ళు అమాయకంగా వున్నాయి.

ఇందాకటి భయంకరత రాజులో యెక్కడా కూడ కానరాలేదు కవితకు.

"పద. పోయి పడుకుందాం" అంటూ దామోదర్ రాజు చెయ్యి పట్టుకొని బెడ్‌రూమ్‌లోకి తీసుకొచ్చాడు. కవిత కూడా లోపలికొచ్చింది.

"చూడు రాజూ! నువ్వు బాత్‌రూమ్‌కి వెళ్ళినప్పుడు అక్కడ నిన్నెవరన్నా గట్టిగా పట్టుకున్నట్టుగాని, జడిపించినట్టుగాని అనిపించిందా?" అని అడిగాడు దామోదర్.

"అలాంటిదేం జరగలేదు డాడీ! అయినా మా టీచర్ చెప్పిన సాహస కథలవల్ల భయం అంటే యేమిటో నాకు తెలీదు. నాలో వున్నది అంతా సాహసమే" అన్నాడు గర్వంగా నవ్వుతూ.

"సరే! పడుకో" అని రాజుని బెడ్‌మీద పడుకో బెట్టాడు దామోదర్.

రాజు నిద్రలోకి జారుకున్నాక, అప్పటివరకు భయం భయంగా చూస్తున్న కవితతో—

"బాబుకి ఏదో దెయ్యం పట్టింది. ఇది నిస్సందేహంగా నిజం. బహుశా అది ఆవహించినట్టు రాజుకి తెలియక పోయివుండవచ్చు. అందుకే రేపు నేను చింతపల్లి అడవులకు బయలుదేరుతున్నాను. ఆ అడవులలో శివనాథ్ అనే స్వామీజీ వున్నారట! ఆయన ఇలాంటి దెయ్యాలని భూతాలని దెబ్బకి వదలగొట్టగలడు! ఆ మధ్య యెవరో

ఇలా అనుకుంటుంటే నే నాయన వివరాలు అడిగి తెలుసుకున్నాను. రేపు ఉదయమే నా ప్రయాణం. మళ్ళీ రాత్రికి ఆయనతో తిరిగి వస్తాను. నేను వచ్చేదాకా రాణిని జాగ్రత్తగా చూసుకో. ధైర్యంగా వుండు" అని చెప్పి నిద్రలోకి జారిపోయాడు దామోదర్.

కవితకు మాత్రం భయాందోళనలవల్ల ఆ రాత్రి మళ్ళీ నిద్రపట్టలేదు.

7

మర్నాడు జీపులో చింతపల్లి అడవులకు బయలు దేరాడు దామోదర్.

జీప్ అడవిని సమీపించింది.

ఘాట్ రోడ్ మీద చాలా దూరం వెళ్ళి పక్కనే వున్న మట్టిరోడ్డు వైపుకు మలుపు తిరిగింది.

ఆ మట్టిరోడ్డు కొంతదూరం వెళ్ళి ఆగిపోయింది. అక్కడినుండి సన్నని కాలిబాట ఎదురయింది.

దామోదర్ జీపు ఆపి కాలినడకన ఆ బాటలో చాలాదూరం సాగిపోయాడు.

చుట్టు చెట్లు..పొదలు దట్టంగా అలముకుని వున్నాయి. రకరకాల పశుపక్ష్యాదుల అరుపులతో ఆ అడవి వాతావరణం గుండెలకు గుబులు పుట్టిస్తోంది.

ఆ కాలిబాట వెంబడి సుమారు ఓ రెండు ఫర్లాంగుల దూరం నడిచాక, పక్కనే చదునైన ప్రాంతం కనిపించింది. ఆ ప్రదేశంలో అందమైన ఓ పూరిగుడిసె నిర్మితమై వుంది.

గుడిసె బయట ఎత్తైయిన రెండు కర్ర స్తంభాలమీద పావురాలగూళ్ళు కట్టబడి వున్నాయి.

ఆ గూళ్ళలో పావురాలు "కువ కువ"మని కూస్తు

న్నాయి.

గుడిసె ఆవరణలో అందమైన పూల మొక్కలు సౌరభాలను గుబాళిస్తూ అందమైన కోమలాంగిలను గుర్తుకు తెస్తున్నాయి.

ఆవరణలో ఆకర్షణీయమైన రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్ది వున్నాయి.

ఇంటి ఆవరణ చుట్టూ నేపాలీ మొక్కలు ఫెన్సింగ్ లా పెంచబడి వున్నాయి.

ఫెన్ సింగ్ దాటి లోపలికి అడుగు పెట్టాడు దామోదర్.

గుడిసె బయట నిలబడి—

"స్వామీజీ!" అని పిలిచాడు.

"ఎవరది?" అంటూ స్వామీ జీవనాథ్ తలుపులు తోసుకొని బయటకు వచ్చాడు.

ఆరడుగుల విగ్రహం తెల్లగా పుష్టిగా వున్నాడాయన. అందరి స్వామీజీలకు విరుద్ధంగా ఆయనకు గడ్డాలు, మీసాలు లేవు.

స్వామీ జీవనాథ్ మెడలో రుద్రాక్షమాల వేలాడుతోంది. నుదుటన పొడవుగా మూడు విభూది రేఖలు నిలువుగా వున్నాయి. తెల్లటి లాల్చీ, తెల్లటి పంచె ధరించి వున్నాడాయన.

ముఖంలో ఎనలేని తేజస్సు వుట్టిపడుతోంది.

ఆయనని చూడగానే దామోదర్ వినయంగా నమస్కరించాడు.

"శివోహం" అంటూ చెయ్యెత్తి దీవించి, "ఎవరు బాబూ మీరు?" అని అడిగారాయన.

"స్వామీ! నా పేరు దామోదర్! మా అబ్బాయికి

దెయ్యం పట్టింది" అంటూ రాజు తనకి, కవితకి యే విధంగా కనిపించి భయపెట్టిందీ వివరించి చెప్పాడు దామోదర్.

"అరెరె! అలా కనిపించాడా?!" అంటూ ఆశ్చర్య పోయాడు స్వామి శివనాథ్.

"అవును స్వామీ! ఈ సమయంలో మీరే మాకు శరణమని మీ దగ్గరకు వచ్చాను" అంటూ వినయంగా విన్నవించుకున్నాడు దామోదర్.

"శివోహం! దుష్టశిక్షణ, శిష్టరక్షణ మా కర్తవ్యం. ఆ దుష్టశక్తిని పారద్రోలి మీ అబ్బాయిని కాపాడుతాను. తక్షణమే బయలుదేరుదాం నడు" అన్నారాయన.

ఇరువురూ కాలిబాట వెంబడి నడుచుకుంటూ మట్టి రోడ్డు ఎక్కి జీపును అధిరోహించారు.

దామోదర్ జీపుని ముందుకు దూకించాడు.

శివనాథ్ గొప్ప జ్ఞాని. అంతకుమించిన దైవభక్తుడు. ఆయన మంత్రాలు తంత్రాలు నేర్చుకోవడానికి క్షుద్ర శక్తులని యెప్పుడూ ఆరాధించలేదు. వాటిని కైవసం చేసుకున్న యే గురువునీకూడ ఆయన ఆశ్రయించలేదు.

ఆయనకి చిన్నతనంలోనే భగవంతుడంటే యెంతో భక్తి కలిగింది. శివ పురాణాన్ని, రామాయణ, భాగవత, భగవద్గీతలని పన్నెండేళ్ళ ప్రాయంలోనే ఆపోసన పట్టారు. వాటి సారాన్ని వంటపట్టించుకోవడానికి సామాన్య మానవ జీవితం పనికిరాదనుకున్నారాయన. అందుకే ఆయన ఆ ప్రాయంలోనే వంటరిగా చింతపల్లి అడవులకు వచ్చేశారు. అక్కడ చాలా ఏళ్ళు భగవంతుని మీద ఏకాగ్రత నిలిపి తపస్సు చేశారు. ఆత్మ శోధనతో భగవంతుడిని తెలుసుకున్నారాయన. త్రికాల జ్ఞానం

కలిగింది స్వామీజీకి. దేవునిమీద యేకాగ్రత నిలపడం వలన ఆయన మహిమ మహిమాన్వితుడయాడు.

స్వామి జీవనాథ్‌ని చూడటానికి భక్తులు ఎవరైనా వస్తే, ఆయన వాళ్ళనుండి యే కానుకలూ స్వీకరించరు. పైగా ఆయనే వాళ్ళకు యే పండో కాయో కానుకగా సమర్పిస్తారు. శివోపదేశంచేసి పంపిస్తారు.

"దుష్టశిక్షణ, శిష్టరక్షణ ఆ పరమశివుని పరమావధి" అని బోధిస్తూంటారాయన.

"చేసేడివాడు వాడే! చేయించెడివాడు వాడే! మనం కేవలం నిమిత్తమాత్రులం" అంటూ శివుని గురించి తెలియ జెబుతూంటారాయన. శివుడినే నిత్యం ధ్యానిస్తూంటారు జీవనాథ్.

మంచికోసం తన ప్రాణాలైనా ఒడ్డే మనస్తత్వం ఆయనది.

చెడుకు చాలా దూరంగా వుంటారాయన. దుర్మార్గులు దుష్టులు అంటే స్వామీజీకి చెప్పలేని అసహ్యం. అలాంటి వాళ్ళ నీడ చూడటానికికూడా ఇష్టపడరు స్వామీ జీవనాథ్.

జీపు చింతపల్లి అడవులుదాటి ఘాట్ రోడ్‌గుండా ప్రయాణం సాగించింది.

వాళ్లు దామోదర్ బంగళా చేరుకునేసరికి అర్ధరాత్రి సమీపించింది.

స్వామీజీని కవితకు పరిచయం చేశాడు దామోదర్. కవిత పక్క నిలబడ్డ రాజుని చూపించాడు దామోదర్.

"ఏడేనండీ! మా కొడుకు" అని చెప్పాడు.

"ఇలారా బాబు" దగ్గరగా పిలిచారు రాజుని స్వామి

జీవనాథ్.

రాజు దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

"నీ పేరేంటమ్మా!?" అడిగారు.

"రాజు" చెప్పాడు రాజు.

"శభాష్! మంచి పేరు" అంటూ మెచ్చుకున్నా రాయన. "నాతోరా బాబూ!" అంటూ రాజుని పక్క గదిలోకి వెంటబెట్టుకు వెళ్లారు జీవనాథ్.

అప్పుడే—

"చుక్ ....చుక్ ....చుక్ .... చుక్"మంటూ దయ్యాల బండి వస్తున్న శబ్దం వినిపించింది దూరాన.

"టంగ్ ....టంగ్ ....టంగ్" గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

గదిలో వున్న రాజు నిలువునా వుద్రేకంతో వూగి పోసాగాడు.

కాని—

స్వామీ జీవనాథ్ యెదురుగా ఆ బాలుని శరీరంలో యెలాంటి వికృతి వికారాలు కలగలేదు.

రాజులోని ఉద్రిక్తతని గమనించారు జీవనాథ్.

కళ్ళు మూసుకొని త్రికాలజ్ఞానాన్ని అవలోకించారు.

ఆయన మనసు పొరలో సినీ రీలులా—

భూత ....

భవిష్యత్ ....

వర్తమాన కాలాలు గిర్రున కదలాడాయి.

అంతే!

ఆయన వదనం వుద్రిక్తమయింది.

"దుర్మార్గులు ....దుష్టులు ... నికృష్టులు" అని ఎవరినో

ఆయన మనసులోనే అసహ్యించుకున్నారు.

కళ్ళు తెరిచి రాజుని చూశారు.

"ఇలారా బాబూ!" అంటూ రాజుని దగ్గరగా తీసుకున్నారు.

"చేసేడివాడు ఆ శివుడే! చేయించెడివాడూ ఆ శివుడే! దుష్టశిక్షణ తప్పదు. అది జరిగితీరవలసిందే!" అని స్వగతంగా అనుకున్నారు.

రాజు అప్రయత్నంగా రెండు చేతులూ యెత్తి ఆయనకు నమస్కరించాడు.

కొంచెంసేపు తరువాత గదిలోంచి ఇద్దరూ బయటకు వచ్చారు.

"మీ బాబుకి పట్టిన దయ్యాన్ని వదలగొట్టాను. ఇంకేం ఫరవాలేదు" అని దామోదర్‌తో చెప్పారు స్వామీ జీవనాథ్.

ఆ తరువాత వెనక్కి తిరిగి చూడకుండా—

"శివోహం."

"శివోహం."

"శివోహం."

—అని తనలోతాను ఉచ్చరించుకుంటూ వడివడిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయారాయన.

8

"టంగ్ ....టంగ్ ....టంగ్ ...." గోడ గడియారం పదకొండు గంటలు కొట్టింది.

నిద్రలో వున్న కవిత బెడ్ మీద కదిలింది.

లేచి నిలబడి బాత్‌రూమ్ వైపు అడుగులు వేసింది.

అప్పుడే బాత్‌రూమ్ తలుపులు తోసుకొని రాజా బయటకు వచ్చాడు.

"ఏం బాబూ! బాత్ రూమ్‌కి వచ్చావా?" అడిగింది కవిత.

"అవును" అంటూ అదోలా నవ్వాడు రాజా.

అలా నవ్వుతూ నే నోరు బాగా వెడల్పుగా తెరిచాడు.

నోట్లో నాలుగు పై పులా కోరలు మొలుచుకొచ్చాయి.

కనుగుడ్లు బయటికి వెళ్ళుకొచ్చాయి. అవి ఎర్రగా గోళాల్లా మండుతున్నాయి.

అంతే!

కవిత గుండె ఝల్లుమంది.

నరాలు వణకసాగాయి.

తనువు కంపించసాగింది.

రక్తప్రసరణ చల్లగా అయిపోతోంది.

రాజా "హీ....హీ....హీ" అని నవ్వుతూ కుడిచెయ్యి ముందుకు జాపాడు.

ఆ చెయ్యి పొడవుగా పాగుతూ కవిత ముఖంమీదికి రాసాగింది.

ఆమె వెనక్కి పారిపోవాలని కూడా పారిపోలేక పోతోంది. పాదాలు బలంగా నేలకు అతుక్కుపోయాయి.

రాజా చెయ్యి పొడవుగా సాగి కవిత ముఖాన్ని తాకింది.

"కెవ్వు"మని గావుకేక పెట్టింది కవిత.

ఒంట్లో సత్తువనంతా కూడదీసుకొని ఒక్క అంగలో వెనక్కు తిరిగి పరిగెత్తుకుంటూ బెడ్ రూమ్‌లోకొచ్చి పడింది.

ఆమె వేసిన గావుకేకకు ఉలిక్కిపడి నిద్రలేచాడు దామోదర్.

"ఏమయింది కవితా? ఎందుకా ఖంగారు? ఏమిటా

వణుకుతూ?" ఆత్రుతగా అడిగాడు దామోదర్.

"దెయ్యం. రాజుని ఆ దయ్యం వదల్లేదు. మళ్ళీ అలాగే కనిపించాడు" అంటూ భయంగా చెప్పింది కవిత.

"వాట్?" ఆశ్చర్యపోయాడు దామోదర్.

"అవును దామోదర్! రాజు మళ్ళీ అదే రూపంతో కనిపించి నన్ను భయపెట్టాడు" వణుకుతూ అంది కవిత.

"స్వామీ జీవనాథ్ మరి ఆ దయ్యాన్ని వదలగొట్టానని చెప్పాడే!" ఇప్పుడు మళ్ళీ అలా కనిపించడం యెలా సాధ్యమౌతుంది?" ఆశ్చర్యంగా అన్నాడు.

"బహుశా—అతని శక్తికూడా పనికిరాలేదేమో!" అంది కవిత.

"జీవనాథ్ సామాన్యమైన మహిమగలవాడు కాదు. అతను అసాధారణమైన మహిమాన్వితుడు. అతడు పిలిస్తే భగవంతుడే పలుకుతాడని అనుకుంటారంతా! అలాంటి వాడి మహిమ రాజుమీద పనిచేయకపోవడమంటూ వుండదు. బహుశా నువ్వు భ్రమపడి వుంటావు. ఏదీ నేను చూసి వస్తాను" అంటూ దామోదరర్ బాత్‌రూమ్‌వైపు అడుగులు వేశాడు.

బాత్‌రూమ్ దగ్గర రాజు ఇంకా నిలబడి వున్నాడు. దామోదర్‌ని చూడగానే క్రూరంగా నవ్వాడు. నోట్లో కోరలు మొలుచుకొచ్చాయి.

కనుగుడ్లు బయటకు వెళ్ళుకొచ్చాయి. అవి ఎర్రగా గోళాల్లా మండుతున్నాయి.

కుడిచెయ్యి ముందుకు చాపాడు రాజు.

ఆ చెయ్యి పొడవుగా సాగుతూ దామోదర్ ముఖం మీదికి రాసాగింది.

దగ్గరకు వచ్చి అతని ముఖాన్ని తాకింది.

దామోదర్ గజగజ వణికిపోతూ ఒక్క గావుకేక పెట్టి పరుగున బెడ్‌రూమ్‌లోకొచ్చి పడ్డాడు.

"కవితా! నువ్వన్నది నిజం! జీవనాథ్ మహిమ రాజా మీద పనిచేయటం లేదు. రాజాని ఇంకా ఆ దయ్యం పట్టుకుని వదల్లేదు" వణుకుతూ అన్నాడు దామోదర్.

"అయితే, ఇప్పుడేం చేద్దాం?" అయోమయంగా అంది కవిత.

"ఇక నాకొక్కటే మార్గం తోస్తోంది రాజాని చంపేయాలి. లేకపోతే వాడిని ఆవహించిన దెయ్యం మనల్ని బలిగొంటుంది" అన్నాడు దామోదర్.

"ఏమిటీ? రాజాని చంపేయాలా?" ఆశ్చర్యంగా అడిగింది కవిత.

"అవును, వాడిని చంపేయాలి. రాజాని యేదో పెద్ద భూతమే ఆవహించి వుంటుంది. స్వామి జీవనాథ్ లాంటి వాడి శక్తికూడ దానిముందు చాలేదంటే ఇప్పుడు రాజాని హతమారిస్తేగాని వాడిని పట్టిన దెయ్యం మనని వదిలి పెట్టదని నా అభిప్రాయం" అని చెప్పి "నువ్వేమంటావ్?" అని అడిగాడు దామోదర్.

కవిత ఆలోచనలో పడింది.

ఎంతైనా రాజా తన కొడుకు.

ఇలాంటి భయంకర విపత్తులో కన్న తండ్రిగా దామోదర్‌కు ప్రేమ చచ్చిపోవచ్చు!

కాని—

తను వాడిని తొమ్మిది మాసాలు మోసి కంది.

రాజాని చంపేయడమా?

ఒప్పుకోవాలా? వద్దా?

"ఏమంటావ్ కవితా?" మళ్ళీ అడిగాడు దామోదర్.

కవిత ఏదో అనబోయేలోగా—

ఇంతలో బెడ్ రూం గుమ్మం ముందు ప్రత్యక్షమయ్యాడు రాజా.

"హీ....హీ....హీ" అంటూ నవ్వాడు.

ఇద్దరూ వెనుదిరిగి చూశారు.

రాజా పళ్ళలో కోరలు అలాగే వున్నాయి. కనుగుడ్లు బయటికి వెళ్ళుకొచ్చి ఎర్రగా సూర్యగోళాల్లా అలాగే మండుతున్నాయి.

చెయ్యి పొడవుగా ముందుకు చాపి నిలబడి వున్నాడు.

దామోదర్, కవితలకు వణుకు పుట్టుకురాసాగింది.

గజ గజా వణికిపోసాగారు.

ఈసారి రాజాని చూడగానే కవితకు ఇలా అనిపించింది.

వాడు బహుశా దెయ్యంపిల్ల వాడయ్యుంటాడు! ఇలాంటి వాడిని కొడుకుగా కళ్ళముందు జీవితమంతా పెట్టుకొని భరించేకంటే చంపేయడమే మేలు....అని అనుకుంది.

"దామూ! ఐ కాంట్ సీ హిమ్ లైక్ దిస్! కమాన్! కిల్ హిమ్! కిల్ హిమ్! షూట్ హిమ్! ఐ సే!" అంటూ కళ్ళు మూసుకొని గట్టిగా అరిచింది.

దామోదర్ ధైర్యం తెచ్చుకొని పక్కనే వున్న డ్రెస్సింగ్ టేబుల్ సొరుగు తెరచి, రివాల్వర్ బయటికి తీశాడు.

రాజాకి గురిపెట్టి కాల్చాడు.

"ఢిష్యూం" అంటూ బులెట్ రాజా గుండెల్లోనుంచి దూసుకుని అవతలికి వెళ్ళిపోయింది.

కాని—

రాజుకి యేమీ అవలేదు.

చెక్కు చెదరకుండా అలాగే నిలబడి వున్నాడు.

"హాహా...హాహా...హాహా....హాహా" అంటూ పగలబడి నవ్వాడు.

ఈసారి ఆ నవ్వు బాలుని గొంతులా లేదు.

బొంగురుగా కంఠస్వరం మారింది.

"కన్న కొడుకని కూడా మమకారం లేకుండా నన్ను చంపాలని చూశారు కదూ!?....హాహా....హాహా....హాహా....హాహా" అంటూ మళ్ళీ పగలబడి నవ్వాడు రాజు.

దామోదర్ కవితలు వణికిపోతూ రాజునే చూడసాగారు.

వాళ్ళకి నోట మాట రావటంలేదు.

వణుకుతూ నిలువుగుడ్లు వేసుకొని అలాగే ఉండిపోయారు.

"నేటికి మీ పాపం పండింది. ఈరోజుతో మీ పని సరి. హీ..హీ..హీ. హీ" అంటూ మరింత వికృతంగా నవ్వాడు రాజు.

"రాజా" భయంగా ఇద్దరూ ఒకేసారి పిలిచారు.

"ఇంకా మీరు నేను రాజునని అనుకుంటున్నారా? నేను ఎవరినో నా కంఠం మీరు ఇంకా గుర్తించలేదా?" అంటూ మళ్ళీ బొంగురుగా అన్నాడు రాజు.

అవును.

ఆ కంఠస్వరం వాళ్ళిద్దరికి యెక్కడో విన్నట్టుగా అనిపించింది.

ఆ స్వరం పదే పదే వాళ్ళ గుండెల్లో ప్రతిధ్వనించింది. వాళ్ళ నరనరాన్ని ఆ కంఠస్వరం బొంగురుగా అరుస్తూ కంపింపజేస్తోంది.

ఆ కంఠస్వరం...

ఆ కంఠస్వరం...

ఆ ఇద్దరి కళ్ళముందు గతం వీడియోలా గిర్రున తిరిగింది.

9

ఆ రోజు మార్కెట్టు బయట స్కూటరు పార్క్ చేసి లోపలికి వెళ్ళబోతుంటే —

"ఏరా సుధీర్ బాగున్నావా?" అన్న పలకరింపు విని పక్కకు తిరిగి చూశాడు సుధీర్.

ఎదురుగా తన చిన్ననాటి మిత్రుడు దామోదర్.

"అరేయ్ దామూ! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు" అంటూ మిత్రుడిని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు సుధీర్.

"ఇప్పుడేం చేస్తున్నావు నువ్వు?" అడిగాడు దామోదర్.

"'సుధీర్ టెక్స్‌టైల్స్' అని నా పేరుమీద దుకాణం నడుపుతున్నాను" అని చెప్పి "నువ్వేం చేస్తున్నావురా?" అడిగాడు సుధీర్.

దామోదర్ ముఖం విచారంగా మారిపోయింది.

"ఏం చెప్పమంటావు బ్రదర్? నాకు డిగ్రీ చేతికొచ్చాక ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. అమ్మ నాన్న మొన్ననే పోయారు. ఏ ఆస్తిపాస్తీ లేని నన్ను బంధువులెవరూ చేరదీయలేదు. ఇలా బికారిగా వూళ్ళు పట్టుకు తిరుగుతున్నాను. ప్రస్తుతం నేను భోజనం చేసి మూడు రోజులైంది" బాధగా చెప్పాడు దామోదర్.

మిత్రుని కష్టానికి చలించిపోయాడు సుధీర్.

"అరెరే! ఎంత పనయింది!" అని నొచ్చుకొన్నాడు.

దామోదర్‌ని వెంటబెట్టుకుని సమీపంలోనే వున్న హోటల్‌కి తీసుకువెళ్ళాడు. కడుపునిండా టిఫిన్ పెట్టిం

చాడు.

"ఒరే దామూ! నాకు కావలసినంత ఆస్తి వుంది. నేను, నా భార్య తప్ప మాకు వెనకా ముందూ ఎవరూ లేరు. నీకు ఉద్యోగం వచ్చేదాకా మా బంగళాలో వుండు. నీకు యే లోటూ రాకుండా చూసుకుంటాను" అని చెప్పాడు దామోదర్ తో.

దామోదర్ కృతజ్ఞతగా చూశాడు మిత్రునికంక.

"నిజంగా నువ్వెంత మంచి స్నేహితుడివిరా!" అంటూ ఆరాధనగా అన్నాడు.

తరువాత సుధీర్ మార్కెట్ బయట పార్కు చేసి వున్న తన స్కూటర్ మీద దామోదర్ ని తన బంగళాకి తీసుకు వెళ్ళాడు.

అతనికి తన భార్య కవితని పరిచయం చేశాడు సుధీర్.

కవిత అందాన్ని చూసిన దామోదర్ దృష్టి మరల్చుకోలేక పోయాడు. అతని కన్ను కవిత మీద పడింది.

సుధీర్ కి బోలెడు ఆస్తిపాస్తులున్నాయి. తల్లిదండ్రులకు ఒకే ఒక్క సంతానం అతను. తల్లితండ్రి నాలుగు నెలల క్రితం కొద్దిరోజుల తేడాలో హఠాత్తుగా గుండె పోటుతో మరణించారు.

తల్లిదండ్రుల మరణం సుధీర్ ని క్రుంగదీసింది. చాలా రోజులు పిచ్చివాడిలా తిరిగాడు. తరువాత బంధువుల సలహాపై పెళ్ళి చేసుకోవాలనుకొన్నాడు. దూరపు బంధువులలో ఓ పేదింటి బంధువుల పిల్ల అయిన కవితని పెళ్ళి చేసుకొన్నాడు.

వాళ్ళ కాపురం అన్యోన్యంగానే సాగుతోంది.

సుధీర్ కవితలో తన తల్లిని చూసుకునేవాడు.

ఆమెని ఎప్పుడూ పేరు పెట్టి పిలిచేవాడు కాదు. "అమ్మా!" అని సంబోధించేవాడు.

చక్రాల్లాంటి కళ్ళు....కోటేరు ముక్కు....పాము లాంటి జడ....నిశ్చలమైన నీటిమీద చిన్నరాయి వేస్తే చెలరేగే చిన్న చిన్న అలలు లాంటి నొక్కు నొక్కుల కురులు....బంగారు మేనిచ్ఛాయ....ఎక్కడ వుండవలసిన వొంపుసొంపులు అక్కడవుండి ఆమె అందం చూపరుల దృష్టిని చెదరగొడుతుంది.

ఆమె అంటే సుధీర్‌కి ఎంతో యిష్టం ఆమె ఎదమీది ఎత్తైన ఆమె పిరమిడ్లంటే అతనికి మరీ యిష్టం. యెప్పుడైనా అతను అలసిపోయి యింటికి వచ్చినప్పుడు వాటి మధ్య తల పెట్టుకుని ఆమెమీద సేదతీరేవాడు.

రోజులు గడుస్తున్నాయి.

సుధీర్ ఉదయమే టెక్స్‌టైల్ దుకాణానికి వెళ్ళేవాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి, భోజనం చేసి, మళ్ళీ షాపుకి వెళ్ళిపోయేవాడు. తిరిగి రాత్రి పదిగంటలకి ఇంటికి వచ్చేవాడు.

సుధీర్ లేని సమయంలో ఆ బంగళాలో కవిత, దామోదర్....ఇద్దరే వుండేవాళ్ళు!

భర్త స్నేహితుడని కవిత అతనితో చనువుగా మాట్లాడేది. ఆ చనువు ఆసరాగా తీసుకుని దామోదర్ ఆమెతో మరింత చనువుగా మెలిగేవాడు. మాటలలో వుండి వుండి తరచుగా ఆమె శరీరాన్ని తాకేవాడు. కవిత కూడా క్రమక్రమంగా అతని యెడల ఆకర్షితురాలైంది.

ఒకరోజు అవకాశం చూసుకుని దామోదర్ ఆమెని కౌగలించుకున్నాడు. కవిత అభ్యంతరం చెప్పలేదు.

భర్తకి ద్రోహం చేస్తున్నాననే ఆలోచన కూడ ఆమెకు కలగలేదు. పైగా సరిగ్గ తమకంగా అతనిని హత్తుకు పోయింది.

పాపం! అమాయకుడైన సుధీర్ దామోదర్ మంచి వాడనే అనుకొంటున్నాడు.

కవిత నిజంగా ఆమె ప్రేమతో తన తల్లినే మరిపిస్తోం దని నమ్మాడు. "అమ్మా! అమ్మా!" అని పిలుస్తూ ఆమె కూడా కూడా తిరిగేవాడు.

ఓ రోజు కవిత సుధీర్ తో—

"ఏమండీ నేను నెలతప్పాను. మీరు తండ్రి కాబో తున్నారు!" అని చెప్పింది.

"హిప్....హిప్....హుర్రే!" అంటూ ఎగిరి గంతే శాడు సుధీర్.

అతని ఆనందానికి మేర లేకపోయింది.

కవితను తన కౌగిలిలో బంధించి గిరగిరా తిప్పేశాడు.

"పిచ్చి మొగుడు" అని అనుకుని కవిత తనలో తాను ఆదోలా నవ్వుకొంది.

ఆ రోజు సుధీర్ ఉదయమే షాపుకు వెళ్లాడు.

ఓ గంట గడిచేసరికి అతనికి భరించలేని తలనొప్పి పట్టుకుంది. వెంటనే స్కూటర్ మీద బంగళాకి వెనుదిరిగి వచ్చేశాడు.

మేడ మెట్లు యెక్కి బెడ్ రూమ్ దగ్గరకు వచ్చాడు.

తలుపులు దగ్గరగా వేసి వున్నాయి.

లోపలినుంచి యేవో మాటలు వినబడుతున్నాయి.

ఆ ప్రయత్నంగా అక్కడే ఆగిపోయాడు సుధీర్.

తలుపు సందుల్లోంచి కుతూహలంగా లోపలికి తొంగి చూశాడు.

"దామూ! నీ లాంటి మగాడి పొందు దొరకడం నిజంగా నా అదృష్టం" పరవశించిపోతూ అంటోంది కవిత.

"నీలాంటి అందమైన ఆడది ఇంత సులభంగా నాకు లొంగిపోవడం నిజంగా నాదీ అదృష్టమే" ఆమె చెక్కిళ్లు ముద్దు పెట్టుకుంటూ అంటున్నాడు దామోదర్.

"ఆగలేను దామూ! తొందరగా ఆక్రమించుకో" అంటోంది కవిత ఆతృతగా.

"మొదలు పెడుతున్నారు" అంటూ ఆమె చీరలాగేసి ఆవేశంగా లంగా బొందు తెంపేశాడు దామోదర్.

అంతే!

సుధీర్ నిలువునా వుద్రేకంతో వూగిపోయాడు.

ఇద్దరినీ నరికి పోగులు పెట్టా లనిపించింది.

కాని—

వెనువెంటనే అతని ఉద్రేకం చల్లారిపోయింది. దాని స్థానే మనసులో ఉవ్వెత్తున బాధాతరంగాలు సాగర కెరటాల్లా ఎగిసెగిసి పడ్డాయి.

'ఛీ! ఇది భార్యా? వీడు మిత్రుడా?... హు... నమ్మక ద్రోహులు.'

తను కవితని యెంతలా ప్రేమించాడో!

ఎంతలా ఆరాధించాడో!

కవితలో భార్యకంటే తల్లినే చూసుకున్నాడు తను. కాని ఏం చేసింది?

వీడు—యేమీ లేనివాడని ఆశ్రయమిస్తే తిన్నింటి వాసాలే లెక్క పెట్టాడు కృతఘ్నుడు!

గదిలోపల జరుగుతున్న నగ్న మోహాన్ని తిలకించ లేక తల పక్కకి తిప్పుకున్నాడు.

"ఏయ్ దామూ! యేమిటిది? అబ్బ! అమ్మ!" అంటూ లోపలినుంచి కవిత మూలుగులు వినిపిస్తున్నాయి.

సుధీర్ హృదయం భగ్గున మండుతోంది.

మనస్సు బాధగా మూల్గింది.

"దామూ! నా పిచ్చి మొగుడు ఈ కడుపు వాడివల్లే వచ్చిందనుకుంటున్నాడు. కాని నీవల్ల వొచ్చిందని వాడికి తెలీదు పాపం!" అంటోంది కవిత.

ఆ మాటలు సుధీర్ చెవుల్లో శూలాల్లా గుచ్చుకున్నాయి.

హృదయం ఆవేదనతో చితికిపోయింది.

పిచ్చిగా జుత్తు పీక్కున్నాడు.

'ఏం చేయాలి? ఇప్పుడు నేనేం చేయాలి?' తనలో తనే ప్రశ్నించుకున్నాడు.

ఎందుకో ఆ సమయంలో అతని మనసు స్థబ్దుగా అయిపోయింది.

జరిగినది ఎలాగూ జరిగిపోయింది. ఇప్పుడు తను వగచి లాభంలేదు. వుద్రేకపడి కవితని, దామోదర్‌ని బయటికి వెళ్ళేసే తనకే తలవంపులు. ఫలానా వాడి పెళ్ళాం ఫలానా వాడితో లేచిపోయిందని నలుగురిలో తనకే తలవంపులు. అందుకే కష్టమైనా, సుఃభమైనా, బాధైనా, బరువైనా ఈ బడబాగ్నిని తనలో నే దాచుకోవాలి. ఈ జీవన నావని ఇలాగే నెట్టుకు రావాలి!

ఒక నిర్ణయానికి వచ్చాడు సుధీర్.

గిరుక్కున వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

సుధీర్ తన బాధని మనసులో దాచుకోలేక, బయటికి వెళ్ళగక్కనూ లేక తనలోతానే సతమతమవసాగాడు. అతనికి జరిగిన అన్యాయం జ్వాలలా బాధతో గుండెను

దహించివేస్తోంది.

ఫలితంగా తాత్కాలికోపశమనం కోసం తాగుడు అలవాటు చేసుకున్నాడు.

రోజూ షాపు మూసేయగానే తాగి స్కూటరుమీద ఇంటికి రావడం ప్రారంభించాడు.

ఆ రోజు కూడా—

యథావిధిగా షాపు కట్టేసి బార్ కి వెళ్ళాడు సుధీర్.

బాగా తాగి రాత్రి పదకొండు గంటల సమయంలో బంగళా చేరుకున్నాడు.

ఆవరణలో స్కూటర్ పార్కు చేసి బంగళా మెట్లెక్కి బెడ్ రూమ్ లోకి ప్రవేశించాడు.

ఎదురుగా కవిత, దామోదర్ లు నిలబడి వున్నారు.

"హలో దామూ! హలో కవితా!" అని పలకరించి పక్కనే వున్న కుర్చీలో కూర్చున్నాడు.

దామోదర్ అదోలా క్రూరంగా చూశాడు.

కవిత పెదాలపైకూడా ఒక వికృతమైన చిరునవ్వు చిందింది.

"సుధీర్! నిన్ను చంపేయాలనుకుంటున్నాము" అన్నాడు దామోదర్.

"జోక్ చేస్తున్నారా?" నవ్వుతూ అడిగాడు సుధీర్.

"కాదు. నిజమే!" బిగ్గరగా అంది కవిత.

సుధీర్ వాళ్ళ వంక నిర్వికారంగా చూశాడు.

"నేను మీకేం అపకారం చేశాను?" అడిగాడు నవ్వుతూనే.

"నీకు తెలియని నిజం ఒకటి వుంది. అది నీకిప్పుడు చెప్పాలనుకుంటున్నాము. కవిత, నేను ఒకరికొకరం దగ్గరయ్యాము. ఆమె నన్ను వదిలి వుండలేక పోతోంది.

నేను ఆమెని వదలి వుండలేక పోతున్నాను" అంటూ చెప్పాడు దామోదర్.

సుధీర్ వేలతంగా నవ్వాడు.

"అది నాకు తెలుసు" అన్నాడు.

"అందుకే నిన్ను అంతం చేద్దామనుకుంటున్నాము" అన్నాడు దామోదర్.

అసలే డ్రింక్ చేసి వున్నాడేమో!.... సుధీర్‌లో మందు మత్తు అప్పటికే మరింత ఎక్కువై కుర్చీలో సరిగా కూర్చో లేకపోతున్నాడు. అటూ ఇటూ ఒరిగిపోతున్నాడు.

దామోదర్ సుధీర్ భుజాలు పడిసి పట్టుకున్నాడు.

కవిత లోపలినుండి పొడవాటి తాడు తీసుకొచ్చింది.

ఇద్దరూ కలిసి కాళ్ళు చేతులు తాడుతో కట్టేశారు. నోటికి టేప్ అంటించారు.

మందు మత్తులో వున్న సుధీర్ వాళ్ళని ప్రతిఘటించ లేకపోయాడు.

అప్పుడే—

"కూ...." అంటూ దూరాన కూత వినిపించింది.

"చుక్ .... చుక్ ... చుక్ .... చుక్ ...." మంటూ దయ్యాలబండి వస్తున్న చప్పుడు వినిపించింది.

గోడ గడియారం "టంగ్ ... టంగ్ .... టంగ్" మని పన్నెండు గంటలు కొట్టింది.

నేలమీద అచేతనంగా పడివున్న సుధీర్‌ని చూసి "సుధీర్! అదిగో దయ్యాలబండి వస్తున్న కూత వినిపి స్తోంది ఆలకించావా? ఇప్పుడు నిన్ను మోసుకెళ్ళి ఆ పట్టాలమీద పడేస్తాము. కాసేపట్లో దయ్యాలబండి ఇటు వైపు వుందే వెళుతుంది. అప్పుడు ఆ బండిచక్రాలక్రింద నీ శరీరం ముక్కలవుతుంది. నామరూపాలు లేకుండా

పోతుంది. తరువాత సమాజాన్ని నీది ఆత్మహత్య అను కునేలా నమ్మిస్తాం. ఆ తరువాత కవిత, నేను ఆనందంగా హాయిగా వుంటాం" అంటూ పకలబడి నవ్వాడు దామోదర్.

సుధీర్ లో చావు భయం తొంగి చూసింది.

అతడిని భుజంమీదికి ఎత్తుకొని బంగళా బయటికి వచ్చాడు దామోదర్.

కవిత అతనిని అనుసరించింది.

"కూ... చుక్ ... చుక్ .... చుక్ ... చుక్" దయ్యాల బండి శబ్దం కొద్దిగా దగ్గరయింది.

ఆ బండి చప్పుడు ప్రాణభయంలో సుధీర్ గుండెల్లో దడ పుట్టిస్తోంది.

బస్తాలో అచేతనంగా వున్న అతను ఇంకా "రక్షిం చండి...రక్షించండి" అని అరుస్తూనే వున్నాడు కాని అతని పెదాలమీద ప్లాస్టరు ఆ అరుపులని నిరోధిస్తోంది. అతని గావుకేకలు బయటికి రాలేక తనువులోనే నర నరాన ప్రతిధ్వనిస్తున్నాయి.

దామోదర్, కవిత రైలు కట్ట దగ్గరకు వచ్చారు.

సుధీర్ ని పట్టాలమధ్య పడేశారు.

"చుక్ ... చుక్ .... చుక్ ..." దయ్యాలబండి దగ్గరవు తోంది.

సుధీర్ భయంతో మరణ వేదన పడసాగాడు.

"ఓ! భగవంతుడా నన్ను కాపాడు" కనిపించని దేవుడిని చివరిసారిగా ప్రార్థించుకున్నాడు.

"సుధీర్! దయ్యాల బండి దగ్గరవుతోంది. ఇక నీ పని అవుట్!" అంటూ పకపకా నవ్వాడు దామోదర్.

అతని నవ్వులో కవితకూడా పకపకమని శృతి కలిపింది,

ప్రాణభయంతో వణికిపోతున్నాడు సుధీర్.

"చుక్... చుక్... చుక్. చుక్" దయ్యాలబండి బాగా దగ్గరవుతోంది.

"కూ..." అంటూ భయంకరంగా కూత పెడుతోంది.

కవిత, దామోదర్ లు పగలబడి నవ్వుతున్నారు.

"మిత్ర ద్రోహీ! భర్త ద్రోహీ! ఇంతకు ఇంతా అనుభవిస్తారు" చివరిసారిగా వాళ్ళని మనసులోనే శపించాడు సుధీర్.

అతని కళ్ళనుండి ఆవేశనిగా కన్నీరు కారుతోంది.

అంతే!

"కూ..." అని కూత వేస్తూ—

"టక...టక...టక...టక...టక. .టక..." మంటూ దయ్యాలబండి సుధీర్ మీదనుండి వెళ్ళిపోయింది.

ఆఖరుసారిగా అతను వేసిన "అమ్మా" అనే భయంకరమైన కేక అతనితోనే గాలిలో సమాధి అయిపోయింది.

అతని తనువు చక్రాల క్రింద తుత్తునియలై పోయింది.

తరువాత—

సమాజం అతనిది ఆత్మహత్య అనుకుంది.

సుధీర్ ఆస్తి కవిత పరమైంది.

సుధీర్ కి వున్న స్కూటర్ ని అమ్మేసి జీప్ కొన్నాడు దామోదర్.

"సుధీర్ టెక్స్ టైల్స్" అని వున్న సుధీర్ బట్టల దుకాణం "దామోదర్ టెక్స్ టైల్స్"గా మారింది.

10

గతమంతా కళ్ళముందు గిర్రున తిర్గగా వర్తమానంలోకి వచ్చారు దామోదర్, కవిత.

రాజు క్రూరంగా వాళ్ళ కే చూస్తున్నాడు.

పళ్ళలో కోరలు అలాగే వున్నాయి.

కనుగుడ్లు బయటికి వెళ్ళుకొచ్చి ఇంకా అగ్నిశిఖల్లా అలాగే మండుతున్నాయి.

"అంటే...అంటే...నూ..ను...నువ్వు సుధీర్ వా?" దామోదర్ కవిత — ఇద్దరూ ఒకేసారి వణుకుతూ అడిగారు.

"అవును నేను సుధీర్ నే. మీరు నన్ను అన్యాయంగా, అకారణంగా, దారుణంగా చంపినందుకు నా ఆత్మ ఎంత గానో క్షోభించింది. అందుకే పగతీర్చుకోవడానికి మీ కొడుకుని ఆవహించాను. ఆనాడు మీరు నన్ను దెయ్యాల బండికింద పడేసినప్పుడు నే ననుభవించిన మరణవేదన ఇంకా నా గుండెల్లో ప్రతిధ్వనిస్తూ నా కళ్ళకి కట్టినట్టుగా కనబడుతోంది" అన్నాడు రాజు.

దామోదర్, కవిత నోట మాటరాక భయవిహ్వాలులై అలాగే వుండిపోయారు.

"కూ..." దూరాన కూత వినిపించింది.

ఆ వెనుక నే—

"చుక్..చుక్...చుక్...చుక్.." మంటూ దెయ్యాల బండి వస్తోన్న శబ్దమయింది.

ఆ బండి చప్పుడు వాళ్ళ చెవులకు ఆ నిశ్శబ్ద నిశీధిలో కర్ణకఠోరంగా వినిపిస్తోంది.

గుండెలు భయంతో గుబగుబమని అదిరాయి.

"టంగ్..టంగ్..టంగ్" గోడగడియారం పన్నెండు గంటలు కొట్టింది.

రాజు వికటంగా నవ్వాడు.

ఆ నవ్వు బంగళా అంతా ప్రతిధ్వనించింది.

దామోదర్, కవిత నిలువునా వణికిపోసాగారు.

"నేటికి మీ పాపం పండింది. మిమ్మల్ని చంపేస్తాను" అన్నాడు రాజా.

వాళ్ళిద్దరూ ఓ క్షణం శిలాప్రతిమల్లా అలాగే వుండిపోయారు.

ఏం చేయాలో పాలుపోలేదు.

రాజా ఒక్కొక్క అడుగే వేసుకుంటూ వాళ్ళని సమీపించసాగాడు.

అలా అడుగులో అడుగు వేసుకుంటూ వాళ్ళకి అడుగు దూరం సమీపంలోకి వచ్చేశాడు.

ఆ ఇద్దరిలోనూ చావు భయం తొంగి చూసింది.

గిరుక్కున వెనుదిరిగి పరుగు అందుకున్నారు.

బంగళా బయటకు వచ్చి, ప్రహారీ గేటు దాటి, ఏకబిగిన పరుగులంకించుకున్నారు.

"కూ .చుక్...చుక్...చుక్...చుక్" దెయ్యాలబండి వస్తోన్న చప్పుడు ఆ నిశ్శబ్ద నిశీధిలో భయంకరంగా వినిపిస్తోంది.

చెట్లు చేమలు దాటుకుంటూ అలాగే పరిగెట్టసాగారు వాళ్ళిద్దరూ.

అలా పరిగెడుతూనే రైలు కట్టదగ్గరకు వచ్చారు.

ఒగురుస్తూ ఇక పరిగెట్టలేక అలుపుతీర్చుకోడానికి ఒక్క క్షణం పట్టాలమధ్య ఆగారు.

భయపడుతూనే ఇద్దరూ వెనక్కి తిరిగిచూశారు.

వెనక రాజా తమని వెన్నంటుతున్న జాడ ఎక్కడా కానరాలేదు.

"హమ్మయ్యా!" అంటూ తృప్తిగా గాలి పీల్చుకున్నారు.

మళ్ళీ ముందుకు దృష్టి సాగించారు.

అంతే

ఇద్దరూ కెవ్వుమని ఒక్కసారిగా కేక పెట్టారు.

ఎదురుగా రాజు నిలబడి వున్నాడు!

కనుగుడ్లు సూర్యగోళాల్లా మండుతున్నాయి.

కోరలు బయటికి పొడుచుకొచ్చి కరకరమని శబ్దం చేస్తున్నాయి.

పట్టాలమధ్య దామోదర్, కవిత!

పట్టాల ఇవతలివైపు రాజు!

వాళ్ళు వేగంగా వెనక్కి తిరిగి అవతలకు పరిగెట్ట బోయారు.

కాని—వాళ్ళిద్దరికి కాళ్ళాడలేదు కాళ్ళు పట్టాలకు అంటుకుపోయాయి.

ఇక వాళ్ళకి పారిపోవడానికి అవకాశంలేదు.

"చుక్ . . చుక్ . చుక్ . . చుక్" దయ్యాలబండి దగ్గరవుతోంది.

"సుధీర్! ప్లీజ్! నీకు దణ్ణంపెడతాము. మమ్మల్ని క్షమించి వదిలెయ్" వాళ్ళు దీనంగా వేడుకోసాగారు.

రాజు మాట్లాడలేదు

"ప్లీజ్ సుధీర్! మమ్మల్ని వదిలెయ్! వదిలెయ్" అంటూ వణికిపోతూ అరవసాగారు దామోదర్, కవిత.

రాజు వికటంగా నవ్వసాగాడు.

"చుక్ . . చుక్ . . చుక్ . . . చుక్" దయ్యాలబండి బాగా సమీపంలోకి వచ్చేసింది.

"అంతే!—

"అమ్మా" అంటూ ఆఖరుసారిగా వాళ్ళిద్దరూ ఒకే

సారి వేసిన చావుకేకలతో పాటు "టక...టక...టక...టక" మంటూ చప్పుడు చేస్తున్న దయ్యాలబండి చక్రాల కింద వాళ్ళ తనువులు తుత్తునియలై పోయాయి.

కవిత, దామోదర్ ల పాపం అంతటితో పండి పోయింది.

వాళ్ళ ప్రాణాలు అనంత వాయువుల్లో లీనమై పోయాయి..

రైలు కట్టపక్కన నిలబడి వున్న రాజా ముఖం ఇప్పుడు నిర్మలంగాను, ప్రశాంతంగాను వుంది.

—: అయిపోయింది :—